ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

బుధవారం 13 ఆగస్టు 2025

యూరియా కోసం రైతుల రాస్తారోకో

- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు 8

అతి భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : సీఎం

చేపపిల్లల జాడేది..?



- పంపిణీపై స్పష్టత కరువు
- భారీ వర్షాలు లేక ప్రాజెక్టులు, చెరువులు వెలవెల
- ఈ ఏడాది చేపపిల్లల టెండర్ల ప్రక్రియకు ఎదురుచూపులే..
- సమయం దాటిపోతే చేపల ఎదుగుదల కష్టమే..
- గత సంవత్సరం సగం మేరకే చేపపిల్లల పంపిణీ
- జిల్లాలో 168 మత్స్య పారిశ్రామిక సంఘాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

చేపపిల్లలు ఒడ్డున పడి విలవిలలాడుతున్నట్లుగా ఉంది మత్స్యకారుల పరిస్థితి.. ఉచిత చేపపిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకోవడంతో గంగపుత్రులు, ముదిరాజుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రతి సంవత్సరం మే మాసంలో టెండర్ల ప్రక్రియ మొదలుపెట్టేవారు. ఈసారి ఆగస్టు మాసం మధ్యలోకి వస్తున్న టెండర్ల ఊసే లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఉచిత చేపపిల్లల పంపిణీపై స్పష్టత ఇవ్వడం లేదు. ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ఉన్నట్లా.. లేనట్లా.. అనే సందిగ్ధంలో మత్స్యకారులు ఉన్నారు. గత సంవత్సరం ఆలస్యంగా చేప పిల్లలు వదలడం వల్ల నష్టం జరిగిందని, ఈసారి కూడా చేపపిల్లలు ఆలస్యంగా వదిలితే ఎదుగుదల లేక నష్టమే మిగులుతుందని మత్స్యకారులు అంటున్నారు.

● జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి ఇది..

జిల్లాలో మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నిత్యం నీటిపై పోరాటం చేస్తూ ఉపాధిని అందుకుంటున్నారు. మత్స్యశాఖ పరిధిలో 401 చెరువులు ఉన్నాయి. 168మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, 9220 మంది సభ్యులు ఉన్నారు. 48మహిళ మత్స్యపారిశ్రామిక సహకారసంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్‌మానేరులో చేపలు పట్టడానికి 741మంది మత్స్య కారులకు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 251మంది, అన్నపూర్ణ ప్రాజెక్టులో 52మంది మత్స్య కారులకు లైసెన్స్‌లు జారీ చేశారు.

● మత్స్యకారుల ఉపాధికి కష్టమే..

మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీపై ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో పథకంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. చేపపిల్లల పంపిణీ ఉండదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ఆలస్యంగా మొదలుపెట్టింది. కాంట్రాక్టర్లు కూడా అంతగా ఆసక్తి చూపలేదు. సమయం దాటిపోవడంతో 50 శాతానికి చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా మార్చుకున్న దానిని కూడా పూర్తి చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. 2024-2025 సంవత్సరానికి రూ.1.59 కోట్ల విలువైన 1.41 కోట్ల చేప పిల్లల సరఫరాకు టెండర్లు పిలిచినా చివరకు 46.71 లక్షల చేపలను 324 చెరువులు, కుంటల్లో వదిలారు. ఈసారి ముందస్తుగానే రుతుపవనాలు పలకరించినా చేప పిల్లల టెండర్ల ఊసే లేకుండాపోయింది. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతూ నీలి విప్లవాన్ని సాధించే దిశగా మొదలుపెట్టిన చేప పిల్లల పంపిణీ ఈసారి కూడా వర్షాలు సమృద్ధిగా కురిసే సమయంలోను పంపిణీ చేసే పరిస్థితి లేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

చేపపిల్లలు చెరువుల్లో వదిలిన తీరు

సంవత్సరం	చెరువులు	వదిలినవి
2016- 17	92	30.5 లక్షలు
2017- 18	66	20 లక్షలు
2018- 19	95	57.48 లక్షలు
2019- 20	313	100.91 లక్షలు
2020- 21	362	115.61 లక్షలు
2021- 22	392	119.25 లక్షలు
2022 -23	392	138.27 లక్షలు
2023 -24	440	141.00 లక్షలు
2024-25	324	46.71 లక్షలు

వెలవెలబోతున్న ప్రాజెక్టులు, చెరువులు..

వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు,

- మిగతా 8లో

యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందవద్దు..

- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

సిరిసిల్ల ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సాగు అవసరాలకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్‌లో కొంతమంది రాజకీయాల కోసం రైతులని రెచ్చగొడుతూ ధర్నాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందిస్తామని అన్నారు. ఈ సీజన్ మొత్తానికి 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం మేరకు జిల్లాకు ఇప్పటి వరకు 12వేల 500మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, జిల్లా రైతులకు ఇంకా కావాల్సిన 11 వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా విడతల వారీగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని విడతల వారీగా ఈ సీజన్ వరకు అందరికి అందజేస్తామని అన్నారు. రైతులు కూడా అవసరానికి మించి, యూరియా వాడవద్దని, మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల, పంటకు, చీడ పీడకు అధికంగా ఆశిస్తాయని, నేల ఆరోగ్యం క్షీణిస్తుందని అన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని, యూరియా గ్రాన్యూల్స్‌కు బదులుగా నానో యూరియా వాడాలని సూచించారు

అప్రమత్తంగా నిరంతర వైద్య సేవలందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



108 అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి 24 గంటలు ప్రజలకు సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాలను సిబ్బంది అందిస్తున్న సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత పరిశీలించారు. 108 వాహనంలో ఆక్సిజన్ నిల్వలు, మానిటర్, ఏఈడీ, బీపీ ఆపరేటర్, లారింజోస్కోప్, అమ్బు బ్యాగ్స్ సర్వైకల్ కాలర్, స్ప్లింట్, ఫోర్ టేబుల్, ఆక్సిజన్ సిలిండర్, స్పైన్ బోర్డ్, అత్యవసర వైద్య పరికరాలు వాటి పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్ష సూచనలు ఉన్నందున 108 అంబులెన్స్ వాహనాల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అత్యవసర సేవలను అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రజిత వెంట ప్రోగ్రాం ఆఫీసర్ నయిమ్ జహ, 108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, జిల్లా మేనేజర్ అరుణ్‌కుమార్, 108 వాహనాల సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ నాల్గవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. సీపీఐ నాల్గవ మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలో ఈనెల 19 నుంచి 22 వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీపీఐ 100 సంవత్సరాల ప్రస్థానంతో ముందుకు సాగుతుందని, ప్రజలు, కార్మికులు, కర్షకులు, అణగారిన ప్రజలతో మరింత మమేకం అవ్వడానికి ఈ మహాసభలు దోహదపడుతుందన్నారు. జిల్లాలోని పవర్‌లూం కార్మికులు, బీడీకార్మికులు, అసంఘటితరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో ప్రస్తావిస్తారన్నారు. ప్రజలు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మన్, అనసూర్య, సోమ నాగరాజు, అజ్జ వేణు, మల్లేశం పాల్గొన్నారు.

పాత టెండర్ విధానం కొనసాగించాలి..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో కూడా పాతటెండర్ విధానాంలోనే కొనసాగించాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ సరఫరా చేయడానికి టెండర్ విధానం మార్చారన్నారు. కొత్త టెండర్ విధానంలోని నియమనిబంధనాలను అనుసరించే ఆర్థికస్థోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలంగా టెండర్లను నిర్వహిస్తున్నందున తమలాంటి చిన్నచిన్న కాంట్రాక్టర్లు అవకాశాలను కోల్పోతారన్నారు. కలెక్టర్‌తో పాటు సంబంధిత రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. బుధవారం నుంచి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పాత టెండర్ విధానం అమలు జరగకుంటే తాము కొత్త టెండర్ విధానంలో టెండర్లు వేసే పరిస్థితుల్లో లేమన్నారు. ఈ సమావేశంలో కంసాల మల్లేశం, బూరు యాదగిరి, భూక్య గజన్‌లాల్, చిలువేరి శ్రీనివాస్, కందుకూరి హరీష్, జలగం శ్రీనివాస్, బాలరాజు, దేవయ్య, ఎల్లయ్య, పర్శరాములు, తిరుపతి, ఆనంద్, వెంకటేశం, వెంకటరమణ, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు..



గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాగుల సత్యనారాయణగౌడ్

ముస్తాబాద్, అగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రంథాలయ ఏర్పాటుకు రేకులషెడ్డును పరిశీలించారు. గ్రంథాలయ ఏర్పాటుకు నిధులున్నాయని, రేకుల షెడ్డు తొలగించి స్లాబ్ పోసి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. గ్రామపంచాయతీ ఈవోతో గ్రంథాలయ విషయంపై చర్చించారు. పాఠకులకు అందుబాటులో త్వరగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి,కొండం రాజిరెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, తాళ్ల విజయ్‌రెడ్డి,శీల ప్రశాంత్, ఎద్దండి మహేందర్‌రెడ్డి మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

గజల్ కవి బూర దేవానందంకు సన్మానం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల గజల్ కవిగా పేరొందిన బూర దేవానందంకు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘన సన్మానం జరిగింది. మంగళవారం సిరిసిల్లలో బూర దేవానందంను సిరిసిల్ల మారసం, సిపాస, జిరసం అధ్యక్షులు, కార్యదర్శులు, కవులు, రచయితలు అభినందించారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కవి కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. గజల్ కవయిత్రి విజయ గోలి రచించిన నవరాగిణి పుస్తకాన్ని ముఖ్యఅతిథులు తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ, సినీగీత రచయిత మౌనశ్రీ ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణకు ఆత్మీయఅతిథిగా హాజరైన సిరిసిల్ల గజల్ కవి బూర దేవానందంను ముఖ్యఅతిథులు సన్మానించారు. అనంతరం గజల్ విభావరి నిర్వహించారు.

నిధులు మంజూరు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గంలోని పలు మండలాలకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మంగళవారం కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కలికోట సూరమ్మ కుడి, ఎడమ కాల్వల నిర్మాణానికి భూసేకరణ నిధులు మంజూరు చేయాలని కోరారు. కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల వరద ప్రధాయని కలికోట సూరమ్మ చెరువు నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజలకు దన్నుగా నిలువాలని కోరారు. ఇప్పటికే గత పది రోజుల క్రితం కుడి, ఎడమ కాల్వల నిర్మాణానికి రూ. 10 కోట్లు నిధులు మంజూరు చేశారని, మరికొన్ని నిధులు మంజూరు చేస్తే కుడి, ఎడమ కాల్వ నిర్మాణం పూర్తి అవుతుందని సీఎంకు వివరించారు. గతంలో పీసీసీ అధ్యక్షులుగా సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టును స్వయంగా వచ్చి పరిశీలించారని, ఆనాడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనిని ప్రారంభించి మత్తడి నిర్మాణం పూర్తి చేసుకున్నామని అన్నారు. కుడి, ఎడమ కాల్వ పనులు పూర్తి అయితే సుమారు 43 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుంటుందన్నారు. చందుర్తి మోత్కురావుపేట రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మూల వాగు, పెంటి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు.

గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి..

- హౌసింగ్ పీడీ శంకర్



మండేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శంకర్

తంగళ్లపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ఆర్ శంకర్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పీడీ శంకర్, ఎంపీడీవో లక్ష్మీ నారాయణలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీడీ శంకర్ మాట్లాడుతూ ఇళ్ల పేమెంట్, ఇసుక, మట్టి, నిర్మాణం తోపాటు ఇతర ఇబ్బందులు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశల వారిగా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాళ్లపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎంపీడీవో లక్ష్మీనారాయణ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ డీఈ కాజా ముజఫరుద్దీన్, ఏఈ అబ్దుల్ హమీద్, కార్యదర్శి ప్రశాంత్ తదితరలు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకుని సీఎస్ఆర్ నిధులతో మోదీ కానుకగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు కేటాయించిన సైకిళ్లను ఎంఈవో కృష్ణహరి, మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డిలతో కలిసి మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కష్టాలు తెలిసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సైకిళ్లను సమకూర్చారని అన్నారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమని భావించిన ఆయన మోదీ కానుకగా సైకిళ్లు అందజేయడం హర్షనీయమని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని గోపి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మనోహరాచారి, నాయకులు తిరుపతిరెడ్డి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, బాలకృష్ణగౌడ్, గణేశ్, నరేశ్, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, ఆంజనేయులు, మహేశ్, ప్రదీప్ రెడ్డి, రాజేశంగుప్తా, గాల్‌రెడ్డి, దేవదాస్, రాంరెడ్డి, రాజిరెడ్డి, నర్సయ్య, తిరుపతి, దయాకర్, కార్తీక్, పూర్ణిమ, లహరి, స్రవంతి, తేజస్వి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత ఉద్యోగులకు సూచించారు. వేములవాడ పట్టణంలని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ అండ్ గర్ల్స్ కాలేజీని సందర్శించారు. కిచెన్ స్టోర్ రూమ్‌లలో తిరిగి స్వయంగా గరిటతో వంటకాలను కలిపి వాటి నాణ్యతను, ల్యాబ్, లైబ్రరీ, ఆట స్థలమును పరిశీలించారు. విద్యార్థులతో హాస్టల్ వసతులు నాణ్యమైన భోజనం పెడుతున్నారా.. అని విద్యార్థుల సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలోని 9,10 ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిజిక్స్, మాథ్స్, ఎకనామిక్స్, ఇంగ్లీష్ పాఠాలను బోధించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కొందరు టీచర్లు విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించలేకపోవడం గమనించి, వారికి సూచనలు చేశారు. క్లాస్ రూమ్‌కు వెళ్లే ఉపాధ్యాయులు ముందుగా సంబంధిత సబ్జెక్టుపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపద్యాయులు ఉన్నారు.

పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బేగంపేట, రామంతాపూర్‌లలోని పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ఇంగ్లీష్‌మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యాసంవత్సరానికి అర్హతగల షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్ పబ్లిక్ స్కూళ్లలో 1వ తరగతి సీట్లను రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆరు కేటాయించారని, ఇందులో గిరిజనులకు 4సీట్లు, ఎరుకుల కులానికి 1 సీటు, ఇతరులకు 1సీటు చొప్పున కేటాయించారని పేర్కొన్నారు. విద్యార్థులు 01-06-2018 నుంచి 31-05-2019 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆగస్టు 13నుంచి 18వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను కరీంనగర్ కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం 9652118867లో సంప్రదించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు.

విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల సాంఘీక సంక్షేమ హాస్టల్లో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాల బాలికల సామాజిక భావోద్వేగ పరిస్థితులు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను మంగళవారం కోర్టు కానిస్టేబుల్స్ జీవన్, తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు తెలిపారు.

భార్య, అత్త వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో అత్త, భార్య సూటిపోటీ మాటలతో వేధించడంతో తట్టుకోలేక ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాలాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మహేందర్ (24) హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన ప్రవళికను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఈ నెల 1న పాప జన్మించింది. వివాహం జరిగినప్పటి నుంచి వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవళిక, అత్త ఎల్లమ్మ మహేందర్‌ను ఇష్టానుసారంగా దూషించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మహేందర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జమ్మికుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువులో ప్రమాదవశాత్తు పడి మహమ్మద్ జబ్బర్ (64) అనే మతిస్థిమితం లేని వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ నెల 12న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లిన జబ్బర్ ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యు లు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసిన ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

చోరీకి యత్నం

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పిప్పరి పురుషోత్తం ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పురుషోత్తం వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లాడు. కాగా ఇది గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు, పురుషోత్తంకు సమాచారం అందించారు. పోలీసులు, పురుషోత్తం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ పోలేవని గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హన్మాజీపేట గ్రామంలోని గుట్ట

గుట్ట కోసం ఏకమయ్యారు..

- పర్యావరణ పరిరక్షణకు హన్మాజీపేట గ్రామస్థుల ప్రయత్నం
- మొరం టెండర్ రద్దు చేయాలని ఆందోళన

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని గుట్టను కాపాడడం కోసం ఊరంతా ఏకమయ్యారు. హన్మాజీపేట గ్రామంలోని సర్వేనంబర్ 596లో గల గుట్ట మొరం తరలించేందుకు ప్రభుత్వం టెండర్ పిలిచినట్లు గ్రామస్థులకు తెలిసింది. గుట్ట నుంచి మొరం తరలించడం ద్వారా పర్యావరణం దెబ్బతిని గ్రామం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హన్మాజీపేట వాసులు ఆందోళన చెందుతున్నారు. గుట్టను కనుమరుగు చేసేవిధంగా జారీ అయిన టెండర్లను రద్దు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని, పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుట్ట మొరం తరలింపుతో జరిగే నష్టాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

గుట్టపై పురాతన ఆలయాలు

ప్రకృతి రమణీయతకు నెలువైన గుట్టపై తాము దైవంగా భావించే అతి ప్రాచీన రామాలయం, అంజనేయస్వామి, పెద్దమ్మతల్లి వంటి ఆలయాలు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గుట్ట మట్టిని తరలిస్తే కోల్పోతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతనమైన హన్మాజీపేట గుట్ట పశువులకు, జంతువులకు, ఇతర జీవరాశులకు జీవానాధారంగా ఉందన్నారు.

దీంతో గుట్ట నుంచి మొరం తరలించే టెండర్ ప్రక్రియను ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్ ప్రక్రియను రద్దు చేయకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హన్మాజీపేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

టెండర్ రద్దు చేయాలి

గొడుగు సురేష్, హన్మాజీపేట



పురాతనమైన గుట్ట పశువులకు, జంతువులకు, ఇతరజీవరాశులకు జీవనాధారంగా ఉంది. గుట్టపైన తాము ఆరాధ్యదైవంగా భావించే పురాతనమైన పెద్దమ్మతల్లి, రామాలయం, ఆంజనేయ ఆలయాలు ఉన్నాయి. గుట్టనుండి మొరం తరలిస్తే పర్యావరణం దెబ్బతిని హన్మాజీపేట, కండ్లపల్లి, పొరండ్ల, బాలపల్లి గ్రామాలు కాలుష్యం అవుతాయి. గుట్ట మొరం తరలించే టెండర్‌ను రద్దు చేయాలి.

గుట్టను కాపాడాలి

గాలిపెల్లి శ్రీధర్, హన్మాజీపేట



హన్మాజీపేటలోని గుట్టనుండి మొరం తరలించేందుకు టెండర్ పిలుస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. మూడు గ్రామాలకు నెలువైన గుట్ట నుంచి మొరం తరలిస్తే చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు చాలా నష్టపోతారు. వెంటనే మొరం తరలించే టెండర్‌ను రద్దు చేసి గుట్టను కాపాడాలి. టెండర్ రద్దు చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం.



మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హన్మాజీపేట గ్రామస్థులు(ఫైల్)

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ వెంకటస్వామి

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి సూచించారు. మానకొండూర్‌లో మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తూర్పు దర్వాజ బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. యువత వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి, మంచిపేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో యువత గస్తీలుగా తిరగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల పోస్టర్‌ను గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలోని వీధుల గుండా పోలీసులు తిరిగి కాగితాలు, నంబర్ ప్లేట్ లేని 69 వాహనాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ సంజీవ్, తిమ్మాపూర్, కొత్తపల్లి, సీఐలు సదన్‌కుమార్, కోటేశ్వర్, పల్లయ్య, ఎస్ఐ స్వాతి, పోలీసులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకటస్వామి

కాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాకతీయ ఉపకాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లికి చెందిన ఎ సంపత్ అనే వ్యక్తి మండలంలోని అన్నారం గ్రామంలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్నాడు.

కాగా పోచంపల్లి గ్రామ శివారుకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కాకతీయ ఉప కాల్వలో పడ్డాడు. సదరు వ్యక్తి అరుపులు విన్న బాటసారులు గమనించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. తీవ్రగాయాలైన సంపత్‌ను 108 వాహనంపై కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీసా కోసం డబ్బులు వెచ్చించి మోసపోయిన యువతి

- మనస్తాపంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలు వెళ్లడానికి వీసాల కోసం ఖర్చులుపెట్టి ఆర్థికంగా నష్టపోయిన జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన నల్లమోతు హర్షిత (25) అనే యువతి పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నల్లమోతు హర్షిత కుటుంబసభ్యులు 25 ఏళ్ల క్రితం జగిత్యాల మండలం హస్నాబాద్‌కు వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఇటీవలే డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా యూనివర్సిటీల కోసం తెలిసిన వ్యక్తుల ద్వారా ప్రయత్నించింది. అమెరికాలోని తప్పుడు యూనివర్సిటీని ఎంచుకొని మోసపోయింది. తద్వారా వీసాల కోసం సుమారు 10 లక్షల రూపాయల వరకు డబ్బులను వెచ్చించి ఆర్థికంగా నష్టపోయింది. చివరి ప్రయత్నంలో భాగంగా జర్మనీ దేశానికి వెళ్తానని ఇంట్లో తండ్రికి చెప్పడంతో తండ్రి శ్రీనివాస్ ఇప్పటికే చాలా డబ్బులు ఖర్చుచేశావని వద్దని వారించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి తాను విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కల నేరవేరదని భావించిన హర్షిత ఈనెల 6 వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం హర్షిత మృతి చెందింది. మృతురాలు హర్షిత తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.



హర్షిత (ఫైల్)

మోర్ సూపర్‌మార్కెట్‌లో.. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమాన్ ప్రాంతంలోని మోర్ సూపర్‌మార్కెట్‌లో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఫేడ్ ఐటమ్స్‌ను విక్రయిస్తున్నారనే సమాచారంతో మోర్ సూపర్‌మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి తెలిపారు. నూడుల్స్, చిక్కి ప్యాకెట్లు, ధనియాల ప్యాకెట్లు గడువు ముగిసినప్పటికీ విక్రయిస్తున్నట్లు గుర్తించి డస్ట్‌బిన్‌లో పారేశామని తెలిపారు. చాలారకాల ఫైడ్ ఐటమ్స్ రెండు నుంచి ఏడు రోజుల వ్యవధిలో గడువు ముగుస్తున్నట్లు గుర్తించామని, వీటన్నిటినీ తొలగించాలని ఆదేశించామని అన్నారు. మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన మహేష్ అలియాస్ నాయక్ మల్లేష్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గద్దం బువన్‌కు శిక్ష విధించారు. జల్సాలకు అలవాటుపడి వీరిద్దరూ అక్రమార్జన కోసం 2021 ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి కారులో 30లక్షల రూపాయల విలువచేసే 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి తీసుకోస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం సమీపంలోని వి వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో కారును వేగంగా నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా ఢీకొట్టారు. ఆటో, కారు బోల్తాపడ్డాయి. ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారును పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకోగా, మరో నిందితుడు ఇషాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి కె ఉమాదేవి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తన ఇంటి ఎదుట వరద నీరు ఆగి బురదమయం అవుతోందని, రోడ్డు మరమ్మతు చేసే వరకు ఎవరినీ వెళ్లనీయనని రోడ్డుకు అడ్డంగా చెట్ల మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు వెదిర శ్రీకాంత్ అనే యువకుడు. మండల కేంద్రం నుంచి పారువెల్లకు వెళ్లే దారిలో ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షానికే తన ఇంటి ఎదుట వరదనీరు చేరి కుంటను తలపించే విధంగా ఉంటుందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వెదిర శ్రీకాంత్ అనే యువకుడు రోడ్డుకు అడ్డంగా మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు. రోడ్డుపై వాహనాలు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి యువకుడికి నచ్చచెప్పే ప్రయత్నం చేయగా వాగ్వాదానికి దిగాడు. దీంతో కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని యువకుడిని సముదాయించి రోడ్డుపైన పెట్టిన మొద్దులను తొలగించారు.

గొల్లపల్లిలో చోరీ.. బంగారం, నగదు అపహరణ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి సమ్మయ్య నెల రోజుల నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని భావించిన నిందితులు ఇంట్లోకి చొరబడి 18 తులాల వెండితో పాటు మూడు తులాల బంగారం, ఎనిమిది వేల నగదును అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి తాళాలు సైతం పగలగొట్టి ఎత్తుకొని వెళ్లారని, పక్కింటి వారు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి చూశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్ పోలీసులు చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో దొంగతనం

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయ గేటును లేపి లోనికి ప్రవేశించారు. కార్యాలయ తలుపుల తాళాలను పగులకొట్టి అందులోని విద్యుత్ మోటార్‌లు, బోరులకు సంబంధించిన పరికరాలు, ఇనుప సామాను ఎత్తుకెళ్లారు. మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది కార్యాలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి అధికారులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి పోలీసులకు పిర్యాదు చేయగా స్థానిక సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు, సీసీ ఫుటేజిని పరిశీలించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- సర్వే రిపోర్టు కోసం ఫోన్ పే ద్వారా లంచం



ఏసీబీకి చిక్కిన సునీల్, రాజేందర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ఫోన్ పే అవినీతి చేపను ఏసీబీ అధికారులకు పట్టించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఓ రైతు ఎనిమిది నెలల క్రితం తన భూమి సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేసి రిపోర్టు ఇవ్వడంలో సర్వేయర్ పెండ్యాల సునీల్ డబ్బులు డిమాండ్ చేశాడు. తన ప్రైవేట్ సర్వేయర్ కె రాజేందర్‌రెడ్డి ద్వారా మంతనాలు జరిపారు. 20 వేల రూపాయల డిమాండ్ చేయగా పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రైతు జూలై 2న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు చెప్పిన ప్రకారం నగదు ఇచ్చేందుకు చేసే ప్రయత్నం విఫలం కావడంతో ఫోన్‌పే ద్వారా రాజేందర్‌రెడ్డికి డబ్బులు పంపించమని సర్వేయర్ సునీల్ చెప్పాడు. దీంతో రాజేందర్‌రెడ్డికి జూలై 9న రైతు 10 వేలు ఫోన్ పే చేసిన వెంటనే రాజేందర్‌రెడ్డి సునీల్‌కు ఫోన్‌పే చేశాడు. ఏసీబీ అధికారులు శాంతినగర్‌లో భూమి సర్వే చేస్తుండగా సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రిజిస్టర్ కేస్ ఆఫ్ అదర్(ఆర్‌సీవో) కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో ఏసీపీ సమావేశం

వీణవంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం సమావేశం నిర్వహించారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు 34 రోజులుగా కొండపాక గ్రామంలోని మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీలపై పరదలు కట్టుట కోసం రిలే నిరహర దీక్షలు చేస్తున్నారు. ఏసీపీ మాధవి రెండు గ్రామాల నాయకలను పెద్దలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కొండపాక గ్రామస్థులు పరదలు కట్టుట నిలిపివేయాలని కోరారు. స్థానిక ఎన్నికల అనంతరం సమస్యకు పరిష్కారం చూపెడుతామని ఇరుగ్రామాల ప్రజలు తొందరపడద్దన్నారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు ధర్నాలు, దీక్షలు, రాస్తారోకో చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రేపు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

సుల్తానాబాద్, ఆగస్టు 12: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 14న వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న ద్విచక్ర వాహనాలను, ఆటోలను 14న గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా మద్యనిషేధ, ఎక్సైజ్ అధికారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సకాలంలో వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి మించి మరొకరు..

- ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అంటూ అధికారులు ఊదరగొడుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనిస్తే అందుకు విరుద్ధంగా ఉంటోంది. తాజాగా హుజూరాబాద్ డిపోనకు చెందిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు చేసిన ప్రమాదకర డ్రైవింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం కలకలం రేపుతోంది. జమ్మికుంట బస్‌స్టేషన్ నుంచి హుజూరాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులు హుజూరాబాద్ వైపునకు ఒకే సమయంలో బయల్దేరాయి. ఆర్టీసీ డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు ప్రమాదకరంగా ఇతర వాహనాలు వెళ్లకుండా ఓవర్ టేక్ చేస్తూ బస్సులను నడిపారు. దీంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. వేరే వాహనాలు వెళ్లకుండా ప్రమాదకరంగా ఆర్టీసీ బస్సులను నడుపుతుండగా వెనుకవస్తున్న వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్‌గా మారింది.



పక్కపక్కనే ప్రమాదకరంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు

కుక్కల దాడిలో.. మనుబోతుకు గాయాలు

కొడిమ్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం రేసు కుక్కల దాడిలో మనుబోతుకు గాయాలయ్యాయి. మనుబోతు కోనాపూర్ గ్రామంలోకి రాగా గ్రామస్థులు రక్షించి అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో బీట్ అధికారి ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యుడు మహేందర్ మనుబోతును మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో వైద్యాధికారి రాకేష్‌తో చికిత్స చేయించారు. అనంతరం మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.



గాయపడి గ్రామంలోకి వచ్చిన మనుబోతు

మూడు రోజులైనా అదుపులోకి రాని మంటలు

- రూ.1.67కోట్ల విలువైన ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగ్గా మంగళవారం కూడా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదంలో రూ.1.67కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్‌సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మెట్‌పల్లి, జగిత్యాల అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలను రప్పించారు. దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం చుట్టూ గోడలను బద్దలుకొట్టి అందులోంచి కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. గోదాంలో గోనె సంచుల కింద కట్టెలు వేసి ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో మార్కెట్ గోదాం పూర్తిగా దెబ్బతిన్నదని అధికారులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంపై సివిల్ సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ అధికారులు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

గోదాంలో సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన వాడిన సంచులు 2018 సంవత్సరం నుంచి నిల్వ చేస్తున్నారు. గోదాం కిరాయి ప్రతి నెల మార్కెట్ కమిటీకి 38వేల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదాంలో నిల్వచేసిన సంచులకు ప్రతి సంవత్సరం టెండర్ వేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఏడు సంవత్సరాల నుంచి గోనె సంచులను గోదాంలో నిల్వ చేస్తున్నారు. దీంతో అగ్నిప్రమాదంలో గోదాంలో ఉన్న గోనె సంచులన్నీ కాలిపోగా వాటికి ఇన్సూరెన్స్ ఉందని అధికారులు తెలిపారు. డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్‌లు అక్కడే ఉండి ఫైర్ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నారు.



మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంను పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మార్కెట్ యార్డులోని గోదాంలో మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫైర్ సిబ్బందికి సూచించారు. ప్రమాదం జరిగిన గోదాంను ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రమాదాన్ని నివారణకు చేపట్టిన చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన సంచులను వెంటనే ఇతర ప్రదేశానికి తరలించాలని, మంటలు ఇతర గోదాంలతో పాటు చుట్టున్న ఇళ్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ నీత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ప్రమాద కారణాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రాష్ట్రపతిని కలిసిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు





అంతర్గాం కస్తూర్బా విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించిన విద్యార్థి సహస్ర

అంతర్గాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌లో రెండోస్థానం పొందిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు ఈ నెల 9న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిశారు. కస్తూర్బా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీక్ష షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. షార్ట్‌ఫిల్మ్‌ను చూసిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విద్యార్థులను తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. ఉపాధ్యాయురాలు లత, స్కూల్ కెప్టెన్ ఎలిగేటి సహస్ర ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిశారు. తెలంగాణ నుంచి తమకు అవకాశం వచ్చిందని వారు పేర్కొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల పెంపునకు 'ఉన్నతి'



మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి మంగళవారం ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని, సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కరీంనగర్ జోన్ బాధ్యులు ప్రవీణ్ కుమార్, సామ్యూల్ మాట్లాడుతూ నెల రోజులు కొనసాగే ఉన్నతి తరగతులను సద్వినియోగం చేసుకొని డిగ్రీ కాగానే ఉద్యోగం సంపాదించుకోవాలన్నారు. టీఎస్‌కేఈసీ కోఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ బూర్ల నరేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఆసుపత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీపై సిబ్బందికి వివరిస్తున్న బృందం

హుజూరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు అందుతున్న సేవలపై ఆస్పత్రి సిబ్బందితో చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ నిర్వహించి, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, రోగులకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..

నేడు ఎడమచేతి వాటం దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'కుడి ఎడమైతే పొరపాటులేదోయ్' అని అన్నాడు ఓ సినీ కవి. నిత్య జీవితంలో పనులకు అందరూ కుడి చేతిని వినియోగిస్తే కొందరు ఎడమచేతితో అవలీలగా చేస్తూ ఆకర్షిస్తారు. కుడి చేతి వారితో సమానంగా చేయగలుగుతారు. ఎడమచేతితో పనులు చేయడం అలవాటో, పొరపాటో తెలియదు గానీ ఓ విలక్షణత మాత్రం వారిలో కనిపిస్తుంది. ఈ అలవాటుకు ఓ ప్రత్యేక రోజు ఉంది. ఆగస్టు 13న అంతర్జాతీయ ఎడమచేతివాటం దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలిసారి 1976 ఆగస్టు 13న నిర్వహించారు. ఎడమచేతివాటం వారు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపైనా, ఇతర సమస్యలపైనా అవగాహన కల్పించడం, వాటిని అధిగమించడానికి ఎడమచేతివాటం వారిని పోత్సాహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. పోలియో, ప్రమాదాల బారిన పడిన వారు, ఎడమచేతివాటం ఉన్నవారు అన్నిరంగాల్లో రాణిస్తారని, మరికొందరు కాస్త మందకొడిగా ఉంటారని చెబుతున్నారు. ఎడమచేతివాటం ఉన్నవారు ఎక్కువ శాతం క్రీడలు, కళారంగాల్లో రాణిస్తారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు కార్యాలయాల్లో చాలామంది ఎడమచేతితో పనులు చేయడం, రాయడం చూస్తుంటాం. ఎడమచేతివాటంతో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

చిన్నప్పటి నుంచి అలవాటు : జి.ఉజ్వల, హిందీ ఉపాధ్యాయిని, సిద్ధార్థ స్కూల్



నాకు చిన్నప్పటి నుంచి ఎడమచేతితో రాయడం అలవాటు. ఇబ్బంది లేకుండా రాస్తాను. మా బాబు రచిత్ (4వ), పాప రక్షిక (యూకెజి) కూడా ఎడమ చేతితోనే రాస్తారు.

ఎడమ చేతివాటంతో ప్రత్యేక గుర్తింపు: పి.అభినందన్, 9వ, బ్లూబెల్స్ స్కూల్



ఎడమచేతితో రాయడంతో నాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎడమచేతితో గుండ్రంగా, అందంగా రాయగలను. చిన్నప్పటి అలవాటు స్థిరమైపోయింది. ఎడమచేతితో రాస్తేనే రాసినట్లుగా అనిపిస్తుంది.

చల్లంగా చూడు పోచమ్మ తల్లీ..



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి (ఆగస్టు 12) : పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిరిని దర్శించుకున్న భక్తులు మంగళవారం ఉదయం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని శివసత్తుల ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలు, సంకన పిల్లలతో గంటల తరబడి ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 5 లక్షల విరాళం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ముస్కు కార్తీక్ రెడ్డి- సుష్మ దంపతులు, వారి పిల్లలు ఆరుష్, కియాన్‌లు రాజరాజేశ్వర స్వామి పేరుతో విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవో రాధాబాయికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అశోక్‌కుమార్, ఉద్యోగులు శ్రీనివాస్ శర్మ, బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో శత వారం సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు మోటూరు మధుసూదన్ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హిందు ఉత్సవ కమిటీ సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసంకు తోడు మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. అంజన్న దర్శనంకు కొండగట్టుకు వచ్చిన తాటిపల్లికి చెందిన రోషిని భక్తురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అది స్వీపర్ లక్ష్మికి దొరకడంతో అవుట్ పోస్టు పోలీసులకు అప్పగించింది. దీంతో విచారణ జరిపి ఏఎస్సై చిలుక శ్రీనివాస్ భక్తురాలికి సెల్‌ఫోన్ అప్పగించారు.





బోనాలతో మహిళలు, కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురిలో సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి: సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ గణ పతి ఆలయంలో మంగళవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



ధర్మపురిలో విశేషాలంకరణలో గణపతి స్వామివారు

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



రేషవేణి మహేష్

ధర్మారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని ధర్మారం మండల యువకుడికి ఆహ్వానం అందింది. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన రేషవేణి మహేష్ యువశక్తి యూత్ స్థాపించి కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రాలు దేశంలోని వంద మందిని భారత్ వలంటీర్లుగా ఎంపిక చేసింది. ఎంపికైన వంద మందిలో ధర్మారం మండలానికి చెందిన మహేష్ ఉన్నారు. గతంలోనూ ఢిల్లీలో నిర్వహించిన మేరీ మాటి, మేరీ దేశ్ కార్యక్రమాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మహేష్ ప్రాతినిధ్యం వహించారు. ఈ అవకాశం కల్పించినందుకు అధికారులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రేషవేని మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 5,658 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 5,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథ కానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరిఅవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 39.254 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.104 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వారంలోగా దళితుల.. భూసమస్యను పరిష్కరించాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గోపాల్‌పూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వారంలోగా దళితుల భూ సమస్యను పరిష్కరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని గోపాల్‌పూర్, తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్ల గ్రామాల సరిహద్దులో ఒక రైతుకు, దళితులకు మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఏడీ ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం గోపాల్‌పూర్, జూగుండ్లలో పర్యటించి వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దళితులు కొంపెల్లి మల్లయ్య, వీరయ్య, నర్సయ్య, ఎల్లయ్యతో పాటు జూగుండ్ల గ్రామానికి చెందిన శ్రీగిరి కనుకయ్యకు చెందిన సర్వేనంబర్ 178లో సుమారు ఎనిమిదేకరాల వ్యవసాయ భూమిపై ఏళ్ల తరబడి వివాదం నెలకొంది. ఈభూమి రికార్డుల్లో దళితుల పేరున ఉన్నప్పటికీ మోఖాపై లేదని, తమ భూమి ఆక్రమణకు గురైందని దళితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు, ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. సమస్యను పరిశీలించేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాలకు కదిలివచ్చారు. అధికారుల ముందు భూమి మాదంటే మాదని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో భూసమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిల్లా అధికార యంత్రాంగాన్ని తీసుక వచ్చినట్లు వివరించారు. ఇరు గ్రామాల భూమి రికార్డు మ్యాపులను అధికారులు పరిశీలించారన్నారు. భూమి కొలతలు, హద్దులు తేల్చాలని వారం లోగా భూసర్వేను చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇరువర్గాలు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు జక్కని నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు

- కేరాఫ్ వివరాలు తొలగింపు
- తండ్రి, భర్త పేర్లు ఇకపై ఉండవు




ఐదేళ్లు దాటిన చిన్నారులకు అప్‌డేట్ తప్పనిసరి

చొప్పదండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లేకుంటే ప్రస్తుతం ఏ పని జరగడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధార్‌కార్డు వివరాల్లో సైతం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారు. తాజాగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్‌కార్డులో కొన్ని మార్పులు చేసింది. ఇక నుంచి ఆధార్ కార్డులపై కేరాఫ్ స్థానా న్ని తొలగించింది.

తండ్రి, భర్త పేర్లు లేకుండానే వ్యక్తి పేరు, చిరునామాతో నూతన విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో తండ్రి, భర్త పేర్లతో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో కేరాఫ్ ఏర్పాటు చేసింది. ఈ విధానంలోనూ ఇబ్బందులు తప్పడం లేదని సంస్థ గుర్తించింది. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించినట్లు యూ ఐడీఏఐ ప్రకటించింది. ఇక నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకున్న వ్యక్తులకు, వివాహం జరిగిన మహిళలకు భర్త పేరు లేకుం డానే చిరునామా మార్పులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌లో చిరునామా మార్చుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో బయో మెట్రిక్ విధానం ఉండదని, ఐదేళ్ల దాటితే వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ నమోదు చేయించాలని యూఐడీఏఐ సూచించింది. ఏడేళ్లు దాటినా బయోమెట్రిక్ ఇవ్వకపోతే ఆధార్ కార్డులు డియాక్టివేట్ అవుతాయని యూఐడీ ఏఐ తెలి పింది. ఏడేళ్లలోపు అప్‌డేట్ చేసుకున్న వారు పది హేనేళ్లకు మరోసారి అప్‌డేట్ చేసు కోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గంగాధరలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఇల్లంతకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాస మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక కుంకమపూజల అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగ రాజుశర్మతో పాటు మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్



ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్

గణేశ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యమని, దేశవ్యాప్తంగా విద్యార్థులకు అండగా నిలిచిన ఏకైక విద్యార్థి సంఘమని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం గీతభవన్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొట్ట మొదటగా ఏర్పడిన ఏకైక విద్యార్థి సంఘమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది బలిదానాలు చేసిన గొప్ప చరిత్ర ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండి పడ్డారు. బడ్జెట్ కేటాయింపు ల్లో విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్ట అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్, హేమంత్ మాజీ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపెల్లి రాజు, బోనగిరి మహేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, నగర నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు

కోరుట్ల, ఆగస్టు 12 : శ్రావణ మంగళవారం పురస్కరించుకొని పట్టణంలోని కోటి నవదుర్గ దేవలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు సాగాయి. పద్మశాలికులోన్నతి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో మార్కండేయ మందిరం, కోటి నవదుర్గ దేవలయంలో మంగళగౌరి వ్రతాలు వేద పండితులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ, సంతోష్ శర్మ, షాకేత్‌శర్మల మంత్రోచ్ఛరణ మధ్య సాగింది. మహిళలు విష్ణుశాస్త్ర నామపారాయణం జరిపారు.



యూరియా కోసం రైతుల రాస్తారోకో

- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు





ఎల్లారెడ్డిపేటలో ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఇల్లంతకుంటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, చందుర్తిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి ఆగస్టు12(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలోని గోదాం వద్ద యూరియా బస్తాల కోసం మంగళవారం వేకువజాము నుంచే రైతులు బారులు తీరారు. రైతుల మధ్య తోపులాట చోటు చేసుకోవడం వల్ల ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు చేరుకున్నారు. తమ వరకు చేరదన్న భావనతో అన్నదాతలు స్థానిక పాత బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు రైతులకు మద్దతు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏవో రాజశేఖర్ చేరుకుని పరిస్థితిని వివరించారు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆగయ్యతో చర్చించి నిరసనకారులను శాంతింపజేశారు. అంతకు ముందు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం గోదాంను సందర్శించారు. వీర్నపల్లిలో యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ధర్నా, రాస్తారోకోకు దిగారు. ప్రధాన రహదారిపై బైఠాయించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, రాజిరెడ్డి,బాలరాజునర్సాగౌడ్, శ్రీనివాస్, సుధాకర్‌రావు, రాజునాయక్, రమేశ్‌గౌడ్, కిషన్, నర్సింలు, జబ్బార్, ప్రభునాయక్, బాల్‌రెడ్డి, సురేశ్‌నాయక్, శ్రీరాంనాయక్, భగవంతం, తులసిరాం, పీర్యానాయక్, శ్రీనివాస్, తిరుపతినాయక్, రాములు, రవి, వేణు, జవహర్‌నాయక్, శివరాం పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : రైతులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇబ్బందులపాలు చేస్తున్నాయని జడ్పీమాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. యూరియా కోసం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి, సీనియర్ నాయకులు ఒగ్గు నర్సయ్య యాదవ్, కేవీఎన్‌రెడ్డి, కముటం రాములు, బిల్లవేని పర్శరాం, ఉడుతల వెంకన్న, బొల్లం వెంకటేష్, రవీందర్‌గౌడ్, కెశవేని శ్రీనివాస్, రఘు, పట్నం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, దయ్యాల మహేష్, సమీర్, పండుగ వేణు, హరికుమార్, బాలకిషన్ అర్జున్, నరేష్, వేణు, గుంటి మధులతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో యూరియా కొరత తీర్చాలని కోరుతూ బి ఆర్ ఎస్ నాయకులు సిరిసిల్ల - కోనరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మల్యాల దేవయ్య, సెస్‌వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ప్రతాపరెడ్డి, అనుపాటి బాపురెడ్డి, రమణారెడ్డి, మహేందర్, గోపిరావు, యాస రాజ్యం, పరశురాములు గౌడ్, శంకర్, దొంతరవేణి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

● చందుర్తి : యూరియా కొరతపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు చిలుక అంజిబాబు, మరాఠి మల్లిక్, ఈర్లపల్లి రాజు, చిలుక పెంటయ్య, దుమ్మ అంజయ్య, డప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, అట్టపల్లి భూమయ్య, పోతరాజు నగేష్, నల్మాస్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రం శివారులోని కోరుట్ల-వేములవాడ రహదారిలోని నందివాగు వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. పోలీసులు చేరుకొని బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడి ధర్నా విరమింపచేయించారు. అనంతనం తహసీల్దార్‌కు యూరియా కొరతపై రైతులు పడుతున్న ఇబ్బందులపై బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, మాజీ ఎంపీపీ గంగం స్వరూపమహేష్, మాజీ ఎంపీటీసీ మంచె లావణ్యరాజేశం, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేష్, అల్లూరి గంగారెడ్డి, నాగులపల్లి రవి, దయ్యాల నారాయణ, ఉప్పులుటి గణేష్, గంటె ప్రశాంత్, దయ్యాల పెద్దులు, గోల్లెం నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో మంగళవారం యూరియా కోసం రైతులు ధర్నా చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

చేపపిల్లల జాడేది?

(5వ పేజీ తరువాయి)

కుంటల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. జిల్లాలో భారీవర్షాలు కురవలేదు. మోస్తరు వర్షాలతో సగటు వర్షపాతం కూడా ఇప్పటివరకు దాటలేదు. జిల్లాలో 7శాతం లోటు వర్షపాతమే ఉంది జిల్లాలో ఈ సీజన్లో 434.5మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 404.4 మిల్లీమీటర్లు కురిసింది. గత సంవత్సరం ఈ సమయానికి 509.6 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. ప్రస్తుతం జిల్లాలో రుద్రంగి మండలంలో 41శాతం లోటు వర్షపాతం ఉండగా, చందుర్తిలో 19 శాతం, వేములవాడరూరల్ 15 శాతం, బోయిన్‌పల్లి 22 శాతం, వేములవాడలో 22 శాతం, సిరిసిల్లలో 19 శాతం, కోనరావుపేటలో 3 శాతం, వీర్నపల్లి 10శాతం ఎల్లారెడ్డిపేటలో 3శాతం లోటు వర్ష పాతం ఉంది. గంభీరావుపేట, ముస్తాబాద్ తంగళ్లపల్లి ఇల్లంతకుంట మండలాల్లో సగటు వర్షపాతం దాటింది. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుగా ఉన్న శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 7.528టీఎంసీలు నీటి నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టులో 3.50 టీఎంసీల సామర్థ్యానికి 1.27టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టులో రెండు టీఎంసీలకు 1.13టీఎంసీల నీటి నిల్వ ఉంది. చాలా చెరువుల్లోకి పూర్తిస్థాయిలో వర్షం నీరు చేరకపోవడంతో వెలవెలబోతున్నాయి.

మహాధర్నాను విజయవంతం చేయండి..

- పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలి శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 1వ తేదిన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతంచేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అలాగే మహాధర్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ టీఎస్ ముందుంటుందని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం సాధన కోసం సెప్టెంబర్ 1వ తేదిన హైదరాబాద్‌లోని ఇందిరపార్కు వద్ద మహాధర్న నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో మహాధర్నలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ఐరెడ్డి సాంబరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగయ్య, నాయకులు మహేందర్, దేవదాస్, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

చందుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ అన్నారు. చందుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోరుతూ చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్మద, మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసచారి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడేపు గోవర్ధన్, మండల ఉపాధ్యక్షులు పల్లెపెని రమేష్, విజయ, లక్ష్మి, జువ్వాడి సంపత్ రావు, ఏరువ రమేష్, రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషిచేస్తోందని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని సర్వాయిపల్లి శివారులో కొనసాగుతున్న బీపీసీఎల్ పెట్రోల్ బంకులో మంగళవారం కిసాన్ మేళాను నిర్వహించారు. రైతులకు ఆరోగ్య పరీక్షలు జరిపి అవగాహన కల్పించారు. వ్యవసాయ విత్తనాలు, పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీపీసీఎల్ ప్రతినిధి నిఖిల్, వైద్యుడు మసూద్, రైతులు సతీష్, శేఖర్, రాజిరెడ్డి, మల్లేశం, వాసుదేవరావు, పద్మారెడ్డి, తిరుపతి, కుమార్, కిషన్, వంశీ, మల్లయ్య, యాదగిరి, సాయి, రాజం, ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే ఆశావాహులు దరఖాస్తులను మంగళవారం స్వీకరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, గౌస్, బాబు, రాజునాయక్, రవీందర్, వెంకటేశ్‌మూర్తి, పద్మారెడ్డి, విజయ్‌రెడ్డి, దేవానందం, కిషన్, రాజ్‌కుమార్, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అతి భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అతి భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన వరద నియంత్రణ చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని, ఆకస్మిక వరదల సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు హెలికాప్టర్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం ఖమ్మంలో ఎదురైన ఇబ్బందులు మరొకసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. వరద సహాయక చర్యలకు కలెక్టర్లకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన వైద్యం, ఆహారం ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. వరదల గురించి ప్రజలకు సామాజిక మాధ్యమాల్లో, ఎఫ్‌ఎం రేడియో, వివిధ మాధ్యమాల ద్వారా ముందస్తు సమాచారం అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగుపాటుకు మృతిచెందే పశువులకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడం వల్ల సహాయం చేయలేకపోతున్నామని, పోలీస్ అధికారులకు సమాచారం అందించి వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్నారు. వరదల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీనంబర్ 9398684240 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రులు ఆయా శాఖలకు సంబంధించి భారీ వర్షాలతో తీసుకోవాల్సిన చర్యలు, తీసుకుంటున్న చర్యలను వివరించారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు..

జిల్లాలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మున్సిపాల్ కమిషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు

నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేయాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద మంగళవారం క్రిబ్‌కో ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కొండూరు రవీందర్‌రావు మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించి వచ్చిన ఫలితాల ఆధారంగా పంటలను సాగు చేసి అధిక దిగుబడులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ నితిన్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూపతి సురేందర్, క్రిబ్‌కో జిల్లా మేనేజర్ ప్రేమ్‌తేజ, దాన్సింధర్ సింగ్, శ్రావన్‌కుమార్ ఉన్నారు.

అర్ధరాత్రి అరెస్టులతో కుటుంబాల్లో ఆందోళన : ఎస్‌ఎఫ్‌ఐ

గంభీరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి సమయాల్లో పోలీస్‌లు అక్రమ అరెస్టులు చేస్తుండటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ పేర్కొన్నారు. కల్యాణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హౌస్ అరెస్టులను చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్ధరాత్రి అరెస్టులు ఏంటో విచిత్రంగా ఉందన్నారు. ప్రజా క్షేత్రంలో విద్యార్థుల పక్షాన, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే అర్ధరాత్రి వేళల్లో అరెస్టులుచేయడం విడ్డూరంగా ఉందన్నారు. అరెస్టుల కారణంగా వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా భయపడే ప్రసక్తి లేదని, ప్రజల పక్షాన, విద్యార్థుల పక్షాన పోరాటాన్ని ఆపేది లేదని కల్యాణ్‌కుమార్ వెల్లడించారు.

రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లో రోడ్లు, మురికి కాలువలను నిర్మించాలని గతంలో ఎమ్మెల్యే కేటీఆర్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం 21వ వార్డు గణేష్‌నగర్‌లో రోడ్లు, మురికి కాలువలను నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషాకు నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ శివారు ప్రాంతమైన గణేష్‌నగర్ అభివృద్ధి పరచడంలో ఎమ్మెల్యే కేటీఆర్, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని పలు సందర్భాలలో ఎమ్మెల్యే కేటీఆర్ చెప్పారన్నారు. సిరిసిల్ల నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా కేటీఆర్ గెలిచిన గణేషనగర్‌లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టలేదని ఆరోపించారు. గణేష్‌నగర్ ఏర్పడి దాదాపు 30 సంవత్సరాలు అయిన ఇప్పటి వరకు సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణంకు నోచుకోలేదని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా సిరిసిల్లలో మున్సిపల్ అధికారులు ఎక్కువ పన్నుల వసూలు చేస్తూ పన్నుల ద్వారా ఆదాయం వస్తున్న అభివృద్ధి మాత్రం శూన్యం అని ఆరోపించారు. ఏ చిన్న వర్షం పడిన సిరిసిల్ల గణేష్‌నగర్ ప్రాంత ప్రజలు రోడ్లపైన నడవలేని దుర్భర పరిస్థితి నెలకొంటుందన్నారు. మురికి నీరు గృహాల ముందు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లి దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గణేష్‌నగర్‌లో వీధిలైట్లు కూడా సరిగా లేకపోవడంతో పాములు, తేళ్ల భయంతో రాత్రి సమయంలో ఇంటి నుండి భయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గణేష్‌నగర్‌లో సీసీ రోడ్లు, మురికి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో పాదయాత్రలు, నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, నక్క దేవదాస్, నాయకులు గాజుల రాజు, గాజుల ఉమాపతి, గాజుల భాస్కర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలో పెద్దూర్ గ్రామంలోని పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, కాంగ్రెస్ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ రాకం రమేష్, వల్మూరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి లబ్ధిదారులకు అందించారు. అలాగే నామాపూర్‌లో రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్మాల రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, తాడెపు కొమురయ్య, తాళ్ల విజయ్‌రెడ్డి, స్వప్న, అనిత, దశరథం, నవీన్‌గౌడ్, బాల్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

తంగళ్లపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని పార్టీ సీనియర్ నాయకులు మందాటి తిరుపతి యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నపల్లెలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు లబ్ధిదారులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాదం తిరుపతి, నక్క సురేష్, మందాటి దేవయ్య, గుండి శ్రీనివాస్, గుండవేని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

తంగళ్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆసాని మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాగిపెల్లి భూపాల్‌రెడ్డి, కోశాధికారిగా పాతూరి సురేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నేబురి సంజీవరెడ్డి, ఆసాని దేవిరెడ్డి, సత్తు బాపురెడ్డి, గనుప నారయణ రెడ్డి, సత్తు రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు.

ఆలయానికి సౌండ్‌బాక్స్‌ల వితరణ

ఇల్లంతకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రంలోని అంజనేయస్వామి ఆలయానికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు తూముకుంట మోహన్‌రెడ్డి సౌండ్‌బాక్స్‌లను మంగళవారం వితరణ చేశారు. ఆలయంలో సౌండ్‌బాక్స్‌లు లేవని తెలుసుకొని రూ 12వేల విలువైన పరికరాలను తనతల్లి తూముకుంట భూమవ్వ చేతులమీదుగా నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో పురోహితులు రాజేశ్వరశర్మ, దొంతుల శంకర్, తూముకుంట శరణ్‌రెడ్డి, కీర్తి విజయ్, మామిడి పర్శరాం, ఎర్రోజు సంతోష్, తిప్పారపు రమేష్, గుమ్మడి హరీష్, కొయ్యడ ప్రమోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు యాంప్లిఫైయర్..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బావుసింగ్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానికుడు హరిచంద్ యాంప్లిఫైయర్‌ను మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. హరిచంద్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, లింగంనాయక్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల అరెస్టు

కోనరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏబీవీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పూజం కార్తీక్ మాట్లాడుతూ పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారన్నారు. వెంట ఇట్టిరెడ్డి గణేష్ రెడ్డి ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

చందుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన 45 మంది 6వ తరగతి విద్యార్థులకు స్వామి వివేకానంద సేవాసమితి సహకారంతో మంగళవారం ఉచితంగా టై,బెల్ట్, ఐడికార్డ్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర, ఉపాధ్యాయులు అమర్‌నాథ్, రవీందర్, రాజ్‌కుమార్, లావణ్య, స్వర్ణలత, రజిత, స్వప్న, మమత, లావణ్య, స్వామి వివేకానంద సేవాసమితి సభ్యులు కొడకంటి గంగాధర్, పంచెరుపుల దివ్యసాగర్, మోత్కుపల్లి మధు, లోకోజు సతీష్, ఎన్నం శ్రీకాంత్, పొంచెట్టి నవీన్, సాన జలందర్, గొల్లపల్లి సాయికృష్ణ, లక్క అనిల్, అనపర్తి వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రచార సమితి అధ్యక్షుడిగా అంజాగౌడ్

ముస్తాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మండల అధ్యక్షుడిగా మెర్గు అంజాగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాంత్రి స్వరూపులు రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులుగా మెర్గు అంజాగౌడ్, గౌరవ సలహాదారులుగా గందే రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అరుట్ల మహేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాకూరి నాగరాజు, సడిమెల ఎల్లం, కోశాధికారిగా కాలువ బాలాజీ, కార్యదర్శిగా ఆనందరావు, సంయుక్త కార్యదర్శులుగా బాలసాని శ్రీనివాస్, గోపిశెట్టి సంతోష్‌గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని గురుస్వాములు జనగామ శరత్‌రావు, కనమేని చక్రధర్‌రెడ్డి, చీటి జితేందర్‌రావు, వేముల రవిగౌడ్, నాగపురి నర్సాగౌడ్‌లు అభినందించారు.

నియామకం

కోనరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముదిరాజ్ పౌరుల సమితి ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని వెంకట్రావుపేట వాసి కర్నాల అనిల్ కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ముదిరాజ్ పౌరుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకర బోయిన మహేష్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్‌లు నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పండుగ స్వామి ముదిరాజ్, శ్రీధర్‌ముదిరాజ్, రాకేష్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యమే లక్ష్యంగా పనిచేసిన ఏఐఎస్‌ఎఫ్

ఇల్లంతకుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యమే లక్ష్యంగా పనిచేసిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని జిల్లాఉపాధ్యక్షుడు పెండెల ఆదిత్య పేర్కొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మంగళవారం మండలశాఖ అధ్యక్షుడు బండారి చందుగౌడ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలే పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు చేస్తున్న ఘనత సంఘానికి దక్కిందన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణే లక్ష్యంగా ఏఐఎస్‌ఎఫ్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సొల్లు సాయి, దొమ్మాటి శ్రీహరి, గండ్ల అనీల్, రాంచరణ్, సన, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గంభీరావుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సుభాష్ విగ్రహానికి పూలమాలలు వేసి, జాతీయ జెండాలను పట్టుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు. జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధికారప్రతినిధి కొక్కు దేవేందర్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, మండల ప్రధాన కార్యదర్శులు విగ్నేష్, మల్లేశం, ఉపాధ్యక్షులు నర్సింలు, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నాగరాజుగౌడ్, మండల కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు స్వామి, అంజనేయులు, కిషన్‌రావు, స్వామి, మహేష్, సర్వోత్తమ్, దేవేందర్, రవీందర్, రాజు, శ్రీనివాస్, చారీ, నరేష్, శ్రీధర్, సంతోష్ ఉన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలోని నాయకులు మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లింబాద్రి, పీర్యానాయక్, వెంకటేష్, దర్శింగ్, రజనీకాంత్, సుమన్, విష్ణు, శ్రీనివాస్, మోహన్, మహేందర్, వంశీ, గోవర్ధన్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.